# శుభలేఖ

## -ఎ.వి.ఎల్.నరసింహారావు

కాఫీ గ్లాసు చేత్తో పట్టుకుని పేపరు తిరగేస్తున్న శ్రీరామ్మూర్తిగారికి పోస్టుమాన్ ఒక శుభలేఖ అందించి వెళ్లాడు.

'స్వస్తిశ్రీ చాంద్రమాన వైశాఖ శుద్ధ పంచమీ బుధవారం ఉదయం 9.20 లకు నా జ్యేష్టపుత్రిక చి.సౌ.సుశీలను కాకినాడ కాపురస్తులు మహారాజశ్రీ రాయసం శ్రీరామ్మూర్తి బావగారి జ్యేష్టపుత్రుడు చి.రఘునాథరావుకిచ్చి రామచంద్రపురం తాలూకా పెద్దాడ గ్రామంలో మా స్వగృహమందు వివాహము జరిపించుటకు పెద్దలు నిశ్చయించారు గాన తామెల్లరు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించి మదర్పిత చందన తాంబూలాదును గైకొని మమ్మానందింపజేయ గోరుచున్నాము'

ఇట్లు విధేయుడు,

సౌభాగ్య సుందర రామయ్య

మంగళ మహత్

శ్రీశ్రీశ్రీ సౌభాగ్య వెంకట్రామయ్య, కె.ఎస్.మూర్తి ఎమ్‌కామ్, మొదలగువారి అభినందనలతో...

శుభలేఖ చదవడం పూర్తిచేసిన పెళ్లికొడుకు తండ్రి ''ఓహో ఆచారం ప్రకారం మనక్కూడా ఒక శుభలేఖ పంపించారన్నమాట వియ్యంకుడుగారు'' అని శుభలేఖను అటూ ఇటూ తిరగేస్తూ అభినందనలు దగ్గర ఆగి ''ఎవరీ మూర్తి? తన వియ్యంకుడుగారికి పెద్ద చదువు చదువుకున్న పిల్లలెవరూ లేరే? పోనీ వియ్యంకుడి తాలూకు దగ్గరవాళ్లెవరయినా అయ్యుండవచ్చు అనుకుందామన్నా ఆ చుట్టుపట్ల ఇంటర్ ప్యాసయిన కుర్రాడొక్కడూ లేడు. ఈవిధంగా చేతిలోని శుభలేఖతో కుస్తీ పడుతున్న తండ్రి బాధ గమనించిన రఘు ఊరుకోలేకపోయాడు.

''ఏమిటి నాన్నా! చాలా తాపత్రయపడుతున్నారు? ఏముంది అందులో?''

''అబ్బే ఏంలేదు నీ పెళ్లి శుభలేఖ. మన వియ్యాల వారి దగ్గరనుండి వచ్చింది. అయితే అభినందనల దగ్గర కె.ఎస్.మూర్తి ఎమ్‌కామ్ అనే పేరుంది. ఆ మూర్తెవరో నీకేమైనా తెలుసా?''

''ఏమో నాన్నా! వాళ్ల బంధుమిత్ర పరివారం సంగతి నాకేం తెలుసు?''

''మీ అమ్మకేమైనా తెలుసేమో? ఏమేవ్ శాంతా ఇలారా! ఇదిగో ఈ మూర్తి నీకేమైనా తెలుసా? ఎమ్‌కామ్ చదివాడట''

తల్లి శాంతతోపాటు రేఖ కూడా పరుగెత్తుకుంటూ వచ్చింది. ''ఏదేది! అన్నయ్య పెళ్ళి శుభలేఖ అప్పుడే వచ్చేసిందే!''

''ఏమండీ! మీరు పెళ్లి మాటలకు వెళ్లినప్పుడు వాళ్ల తరపు అబ్బాయి ఎవరైనా ఉన్నారేమో కనుక్కోలేకపోయారా? మీకు అసలు శ్రద్ధలేదు. రెండు సంవత్సరాల నుండి ప్రయత్నిస్తున్నారుగానీ ఏమీ స్థిరపరచలేకపోయారు. ఈ మూర్తి ఎవరో ఇంతకుముందే వాకబు చేస్తే మనకేమయినా కొంచెం పనికొచ్చేవాడేమో?'' అంది శాంతమ్మ.

రేఖ శుభలేఖను జాగ్రత్తగా పరిశీలిస్తూ మూర్తి దగ్గర కొచ్చి ఆగింది. ఒకవేళ తన క్లాస్‌మేట్ మూర్తేమో, అన్నట్లు ఎస్ఎస్‌సిలో ఒక మూర్తి వుండేవాడు. వెనకాలే వస్తూ ఏమీ తెలియనట్లు తన జడ పట్టుకుని లాగి ఏడిపించేవాడు. ఆ మూర్తా? నా పిచ్చిగానీ వాళ్లకీ వీళ్లకీ సంబంధమేమిటి?

ఈవిధంగా ఒకరిని మించి ఒకరు దీర్ఘంగా ఆలోచిస్తున్న సమయంలో ''పోనీలెండి నాన్నగారూ! అతన్ని గురించి ఎందుకంత తర్జన భర్జనలూ? పెళ్లిలో అన్నీ తెలుస్తాయిగా'' అన్నాడు రాఘవ.

''అవునులేరా. నీకేం, బాధ మాకుగాని. అసలు లేఖకు నీకంటే ముందే పెళ్లి చేసేద్దామనుకున్నాను'' అన్నాడు తండ్రి.

''సరేలెండి నాన్నా. ఇప్పుడు నాకేమీ పెళ్లక్కర్లేదు'' అని రేఖ విసురుగా లోపలికి వెళ్లిపోయింది.

ఎస్ఎస్‌సి పాసవగానే ఇంటర్‌లో జాయిన్ చేసారు రేఖను. కానీ 18 ఏళ్లు నిండాక ఇంకా చదువేమిటని మాన్పించేసారు. రేఖ పైకి చలాకీగా కన్పించినా ఆమెకు తెలియని అమాయకత్వం ఆమెలో గోచరిస్తుంది. వయస్సుకు తగిన అందం ఆమెలో లేకపోలేదు. అసలు ఆడపిల్లల దగ్గర ఒక వ్యక్తిని అనుకుని పెళ్లి మాట తెచ్చారో ఇంక వాళ్లకదే ఆలోచన''

''మూర్తి పేరు బాగుంది. చదువు కూడా పెద్దదే. అసలిప్పుడు పెళ్లి చేసుకునే ఉద్దేశ్యముందో లేదో! అయినా అన్నయ్య పెళ్లిలో అన్నీ తెలుస్తాయిగా. బహుశ నాన్నగారు ఈ సంబంధం మాట్లాడతారేమో'' అని మూర్తి ఆకారాన్ని ఏర్పాటు చేసుకుంది రేఖ.

★★★

పెళ్లివారిల్లు కిటకిటలాడుతోంది. సుందర రామయ్యగారు ఆ ఊరి పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్. చుట్టాలు, స్నేహితులు, నౌకర్లు చౌకీదార్లతో ఇల్లంతా సందడిగా ఉంది.

''లేవండ్రా! పెళ్లివారు పొలిమేరకొచ్చారు. ఏవండీ బ్రహ్మగారు ఎదురు సన్నాహానికంతా రెడీయేనా? కొంచెం త్వరగా లేవండి. ఒరే నారాయణా! ఏమోయ్ మూర్తి నువ్వు కూడా రావాలి''.

''ఆ! నేనెందుకులెద్దురు కుర్రాడిని'' అన్నాడు మూర్తి.

''బాగుందోయ్! నువ్వు లేకుండానే'' అన్నాడు సుందర రామయ్య.

ఎదురు సన్నాహం జోరుగా సాగింది. ''ఇదిగో మూర్తీ! నువ్వు మరోలా భావించనంటే చెప్తాను. వీరిని విడిదికి తీసుకెళ్లి ఏం కావాలో కొంచెం చూసిరా నాయనా''

మూర్తికి కొంచెం చురుకుపాలెక్కువ. అందులోనూ మనిషంత మనిషి, తనని ఆవిధంగా పురమాయించడం వలన కాదనలేక మగపెళ్లివారిని తీసుకుని విడిదికి బయలుదేరాడు.

''మూర్తీ! వీరిని కొంచెం విడిదికి తీసుకెళ్లవోయ్'' అన్న మాటలు శ్రీరామమూర్తిగారు, పెళ్లికొడుకు, రేఖ కూడా విన్నారు.

''ఓహో! ఇతనే కాబోలు మూర్తి. ఇదివరకెప్పుడూ చూసినట్లులేదు. వయస్సు 22-25 మధ్య వుండవచ్చు. ఏమే మన రేఖకు ఈడూ జోడూను. ఏమంటావు?'' అని శ్రీరామమూర్తిగారు గుసగుసలాడారు భార్యాపుత్రులతో.

తండ్రి, అన్నగారు మాట్లాడుకునే ప్రతి మాటా చాలా జాగ్రత్తగా వింటోంది రేఖ. విడిదిలో ఎలాగైనా మూర్తిని పలకరించాలని సరదా పడుతోంది.

''ఏమండోయ్ మూర్తిగారూ! మా చుట్టాలలో చాలా మందికి చంటిపిల్లలు ఉన్నారు. ఆవుపాలు కావాలి. పిల్లలందరూ తలంటుకుంటారు. కుంకుడుకాయలు, నూనె, నలుగుపిండి కావాలి. తెల్లవారుఝామున 4 గంటలకు ఇద్దరు మనుష్యులు వేడినీళ్లు రెడీ చేయాలి'' అంటూ పెద్ద లిస్టు మొదలెట్టింది.

''సరేనండీ. మీ వియ్యంకుడిగారికి కాగితం మీద చిట్టా రాసివ్వండి. అది నేను ఆయనకు అందజేస్తాను. నోటికి చెబితే కొన్ని మర్చిపోవచ్చు. అయినా నేనేదో చుట్టం చూపుగా వచ్చినవాడ్ని. నాకేం మధ్యన?'' అని మూర్తి తన కొంటెదనాన్ని ప్రదర్శించాడు.

''శుభలేఖలో పేరు వేయించుకోవడంతో అయిపోయిందనుకున్నారా? మామగారిలో సగం బాధ్యత మీరు తీసుకోవలసి వుంటుందేనని మీకు తెలియదేమో

పాపం'' అని తడుముకోకుండా అంటించింది రేఖ.

''ఓహో అదా మీ బాధ! మిమ్ములను విడిదిలోకి తీసుకుని రావడంతోనే నా సగం బాధ్యత అయిపోయింది''

శ్రీరామమూర్తిగారు, కాంతమ్మ వీళ్ల వాదనలు చూసి చిన్నగా నవ్వుకున్నారు.

''అమ్మా! రేపు పొద్దున నీకు మూర్తిలాంటి అతనినే కట్టబెడితే ఇలాగే తగువులాడుకుంటారేంటి?''

''పో నాన్నా! నువ్వు మరీనూ?'' అని రేఖ చిన్న సిగ్గు అభినయించింది.

మూర్తి కొంచెం స్తంభించిపోయాడు. రామ్మూర్తిగారి మాటలలో భావాన్ని గ్రహించాడు. కొంచెం తేరుకుని ''ఆ దానికే ముందిలెండి. ఆ మూడుముళ్లు పడేవరకే. తరువాత అన్నీ సర్దుకుంటాయి. అయినా భార్యాభర్తల మధ్య ఇటువంటి ప్రణయ కలహాలు సహజమేగా'' మూర్తి విసిరిన చెణుకు రేఖను కొంచెం తికమకలో పెట్టింది.

''అయినా అలా ఎందుకనాలి? అసలు నాన్నగారు మాత్రం మూర్తిలాంటివాడని అనడమేమిటి? నాన్నగారి మాటలలో భావాన్ని గ్రహించే అలా అన్నాడేమో ఆయన. ఏమిటో ఎందుకు నాకీ పిచ్చి ఆలోచన? అని అనుకుంది రేఖ తనలో తను.



★★★

విడిదిలో స్నాతకం ఏర్పాటు చాలా హడావుడిగా జరుగుతోంది. పిలుపులకు వచ్చిన రేఖనుచూసి మూర్తి ఒక్కసారిగా గట్టిగా నవ్వాడు. ప్రక్కనున్న స్నేహితులకు ఏమీ అర్థం కాలేదు.

''అంతకన్నా బరువైన చీరలింకేమీ లేవేమో కనుక్కోరా?'' అన్నాడు మూర్తి.

రేక తన చీరకేసి ఒకసారి చూసుకుని వెనక్కి చూసింది తనని చూసి నవ్వుతున్న మూర్తివైపు. ఏదో పల్లెటూరుకదా! అయినా స్నాతకం పిలుపుకు ఇంతకన్నా గొప్ప చీర ఎందుకు? అనుకుందిగానీ మూర్తి వెక్కిరింపు చివుక్కుమనిపించింది.

మాట తీసేయలేక డోలుసన్నాయి తీసుకుని భోజనం పిలుపులకు బయలుదేరాడు మూర్తి.

''పోనీలెండి ఒంటిగంటకయినా పిలుస్తున్నారు'' అంది ఓ గొంతు. డబ్బు అయిపోతుందని వంట బ్రాహ్మణులను పెట్టకుండా వియ్యపురాలుగారే వండేసిందేమో వంటంతా?'' అంది మరో అమ్మలక్క పిలుపులు పూర్తి చేసుకుని వెడుతున్న మూర్తిని చూస్తూ.


''అవునే బరువైన పేంటులు లేక తేలికైన లుంగీలు కట్టడం మాకు చేతకాదని చెప్పవే'' అంటూ మేనత్త కూతురితోచెప్పి మూర్తిమీద అక్కసు కాస్త తీర్చుకుంది రేఖ.

★★★

పట్టుపంచ కట్టుకుని అన్నం బుట్ట తీసుకుని వస్తున్న మూర్తిని చూసి ''అదేమిటోయ్! నువ్వు కూడా కూర్చో. ఏదో కుర్రాడివి కదా అని పిలుపులకు పంపేను అంతే. ఇప్పటికే పొద్దుపోయింది. ఇంక వడ్డనలోకి దిగితే మూడయిపోతుంది. అసలే మీ కాలేజీ కుర్రాళ్లకు పదిగంటల్లోపల భోజనం అయిపోవాలి'' అంటూ వారించాడు సుందర రామయ్య.

''మూడోసారి కాఫీ ఇప్పుడే లాగించాను. ఫరవాలేదులెండి. రేపు కాలేజీకి వెడితే ఈ సరసాలు ఎలా తీరు

ముగ్గు: ఎ. గీతాంజలి (ముత్తిరేవల్)



తాయి?'' అన్నాడు మూర్తి నవ్వుతూ. వీలు చేసుకుని మూర్తి ఆడవాళ్ల వరుసల చుట్టూనే తిరిగేవాడు. రేఖకు కూడా అతనిని ఎలాగైనా ఏడిపిద్దామని సరదా!

''వంకాయ, అరటికాయ, వంకాయ, అరటి కాయ మీకండీ'' అంటూ రెండు బుట్టలతో వచ్చాడు మూర్తి. రేఖ వద్దని చెయ్యూపింది. అలాగే అడుగుతూ వెడుతున్న మూర్తి వైపు చూసి ''ఏమండోయ్! తెచ్చినవన్నీ తెచ్చినట్టే పట్టుకుపోతే ఎలా?'' అంటూ రేఖ పిలిచింది.

''మీరే వద్దన్నారుకదా ఇందాక'' అంటూ తిరిగి రేఖ వద్దకు వచ్చాడు.

''అవును మరిమీరు వంకాయ, అరటికాయ అంటుంటే ఇదేమిటి కాయలు కాయలే వేస్తున్నారు కాబోలు అని వద్దన్నాను'' అన్నది రేఖ.

''మరి ఇప్పుడెందుకు పిల్చారు?''

''ఆ ప్రక్కని వడ్డిస్తుంటే చూచి కాయలుకాదు కూరలే అని తెలిసి పిల్చాను. అయినా వద్దులెండి. వెళ్లండి'' కొంటెతనం చూపించింది.

రెండుపంక్తుల ఆడవాళ్లు ఒక్కసారి వద్దని నవ్వారు. మూర్తి చిన్నబుచ్చుకుని వెళ్లాడు. తరువాత రసం గోక ర్ణంతో వచ్చాడు వచ్చాడు మూర్తి.

''ఏవండోయ్ రసం వేడిగా వుంటే కావాలి. లేకపోతే అక్కర్లేదు'' రేఖ చెప్పింది.

''కొంచెం వెచ్చబెట్టించి తీసుకుని వస్తానుండండి'' అని వెళ్లిన మూర్తి ఆ రసం బాగా మరగబెట్టి తీసుకు వచ్చి రేఖ వద్దంటున్నా చెయ్యిమీద పోసాడు. చుర్రు మన్న చెయ్యి వెనక్కి తీసుకుంటూ ''అబ్బా మరీ ఇంత వేడా?'' అని కసిరింది.

మూర్తి పట్టించుకోకుండా నవ్వుతూ వెళ్లిపోయాడు.

★★★

ఆ రాత్రి శోభనం గది దేదీప్యమానంగా అలంకరించ బడింది. వెండిపళ్లాల నిండా రకరకాల తినుబండా రాలు, పన్నీరు, సెంటు, గంధం, తమలపాకులు మొద లగునవన్నీ బల్లమీద అమర్చబడ్డాయి. రేఖలాంటి కన్యలు తమకు కూడా పెళ్లయితే శోభనం నాడు ఇలా జరుగుతుంది కాబోలు అని అనుకుంటున్నారు.

''శోభనం పాట పాడండర్రా. ఒసే లీలా, గిరిజా, లతా! ఏమిటమ్మా అంతా అలా సిగ్గుపడతారు?'' అంది ఒక పెద్ద ముత్త యిదువు.

''చాలా టైమైంది. హారతులిచ్చి ఇవతలకు రండి'' అన్న సుందర రామయ్యగారి మాటకు నవ్వుకుంటూ-

''అదేంటిరా తమ్ముతూ! ఇంకా దంపత్తాంబూలాల వేడుక అవలేదు. అప్పుడే పొమ్మంటావు. ఇంక రేపటి నుండి నీ కూతురికీ, అల్లుడికీ ఎవరూ అడ్డురారులే'' అంది పెళ్లికూతురు మేనత్త వెంకుబాయమ్మ.

''ఏదమ్మా సుశీలా! ఇలా తాంబూలం మీ ఆయన కియ్యి'' అంది పెళ్లికూతురు తండ్రి.

''అదేమిటి వదినగారూ! మా అబ్బాయి ఇస్తాడు లెండి ముందు. ఆ తమలపాకుల చిలక ఇలా ఇయ్యి'' అంది పెళ్లికొడుకు పినతల్లి.

''అన్నయ్య ఎంగిలి చేసిన తమలపాకులు తినాలి కాబోలు వదిన. రేపు తను మూర్తిని కట్టుకుంటే అతను కొరికి ఇచ్చిన కిళ్లీ తను తినాలి కాబోలు'' అనుకుని ప్రక్కన నిలబడ్డ మూర్తికేసి ఎవరూ చూడకుండా చూసింది ముసిముసి నవ్వుతో. మూర్తి కూడా ఆ నవ్వు నందుకున్నాడు.

''ఏదో తాంబూలాలు ఇప్పించి తలుపులు మూసే యండమ్మా'' అన్నారు బ్రహ్మగారు.

దంపత్తాంబూలాల టైముకు శోభనం గది లోపల బయట రద్దీగా ఉంది. ఆయన భార్య ఎవరో? ఆ సుందరాంగి ఎవరి అర్ధాంగో? అని తర్కించుకునేవా ళ్లకూ, ఆ అమ్మాయి భర్త ఎవరో? ఆ తెల్లటావిడ మొగుడెవరో అని అంతవరకూ సందిగ్ధావస్తలోనున్న మగవారికి తమ తమ సందేహాలు తీర్చుకునేటందుకు అదే సమయం. ముందు తాంబూలం పెళ్లికూతురు తల్లిదండ్రులు అందుకున్నారు. తరువాత పెండ్లికొ డుకు తల్లిదండ్రులు, అక్కడినుండి వరుసగా ఒక్కొక్క జోడీయే ముందుకు వచ్చి అందుకుని వెడుతున్నారు. పెద్దలంతా అయ్యారు. మూర్తి చల్లగా బయటకు జారు కుంటున్నాడు.

''ఏమోయ్ మూర్తీ! రావోయ్'' అని పిల్చిన సుందర రామయ్యకు మూర్తి లోపల ఎక్కడా కనిపించ లేదు.

''అదేమిటోయ్ మూర్తీ! ముందు పిలవలేదని కోపమా? నువ్వు రాకపోతే మా మేనకోడలు చిన్నబుచ్చు కోదూ?'' అంటూ బయటనుంచి చెయ్యి పుచ్చుకుని లాక్కొచ్చేడు మూర్తిని.

మూర్తి తాంబూలం పుచ్చుకుని ఎవరికివ్వనా అని ఆలోచిస్తున్నట్లు నటిస్తున్నాడు. రేఖ సిగ్గుపడుతోంది ఆ తాంబూలం తన చేతిలో పెట్టేస్తాడేమోనన్నట్లుగా! ఇంక మూర్తి తనకు కాబోయే భర్తే అని పిచ్చి అభిప్రాయంతో.

రేఖను మూర్తిని గమనించిన గిరిజన తన భర్త చేతలో వున్న తాంబూలాన్ని వెంటనే లాగేసుకుని తనే మూర్తి భార్యగా ప్రకటించుకుంది.

ఒక్కసారి మూర్తిని, గిరిజను చూసి నిర్ఘాంతపో యింది రేఖ. రామ్మూర్తిగారు, శాంతమ్మ, పెళ్లికొడుకు రఘు ఒకళ్లకేసి ఒకళ్లు చూసుకుంటూ తెల్లముఖాలు వేశారు. మూర్తి సుందర రామయ్యకు మేనకోడలు మొగుడని అంతవరకూ తెలుసుకోనందుకు పశ్చాత్తాపప డ్డారు.

★

